# బోధన్ గులాబీమయం

- బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్ నామినేషన్‌కు తరలివచ్చిన జనం
- ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్సీ కవిత



బోధన్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్ నామినేషన్‌కు హాజరైన జనం



బోధన్‌లో ద్విచక్రవాహనంపై ర్యాలీ స్థలానికి వెళ్తున్న ఎమ్మెల్సీ కవిత

బోధన్, నవంబర్ 9: బోధన్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్ నామినేషన్ సందర్భంగా గురువారం నిర్వహించిన ర్యాలీతో బోధన్ పట్టణం గులాబీమయమైంది. గులాబీరంగు జెండాలతో నియోజకవర్గం నలుమూలల నుంచి తరలివచ్చిన జనంతో పట్టణంలోని ప్రధాన రహదారులు కిక్కిరిసిపోయాయి. సుమారు నాలుగు కిలోమీటర్ల బోధన్ పట్టణంలో ట్రాఫిక్ స్తంభించింది. పట్టణ శివారులో ప్రారంభమైన ర్యాలీ ఆచన్‌పల్లి, శక్కర్ నగర్ చౌరస్తా, బస్‌స్టాండ్ మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు కొనసాగింది. నామినేషన్ ర్యాలీకి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ముఖ్యఅతిథిగా వచ్చారు. ర్యాలీలో టాప్‌లేని వాహనంలో కవిత, బీఆర్ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్‌తో కలిసి ప్రజలకు అభివాదం చేశారు. జై కేసీఆర్, జై కవిత, జై షకీల్ నినాదాలతో పట్టణం మార్మోగింది. ర్యాలీ ముగిసిన తర్వాత బీఆర్ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో కలిసి ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజాగౌడ్‌కు నామినేషన్ పత్రాలను సమర్పించారు. బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా, బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరావు దేశాయ్, బీఆర్ఎస్ బోధన్ మండలం అధ్యక్షుడు గోగినేని నరేంద్రబాబు (నర్సయ్య) ఉన్నారు.

### ద్విచక్రవాహనంపై వెళ్లిన ఎమ్మెల్సీ కవిత

బీఆర్ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్ నామినేషన్ ర్యాలీలో పాల్గొనేందుకు కారులో గురువారం ఉదయం బోధన్ పట్టణానికి వస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు పట్టణ శివారులో ట్రాఫిక్ సమస్య ఎదురైంది. బీఆర్ఎస్ నామినేషన్ ర్యాలీకి పెద్ద ఎత్తున జనం తరలిరావడంతో కవిత ప్రయాణిస్తున్న కారు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయింది. దీంతో ఆమె ద్విచక్రవాహనంపై ర్యాలీ స్థలానికి చేరుకున్నారు.

### నామినేషన్‌కు తరలిన జనం

రెంజల్/ఎడపల్లి/నవీపేట, నవంబర్ 9: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి షకీల్‌కు మద్దతుగా నామినేషన్ సందర్భంగా గురువారం రెంజల్ మండలం నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు బోధన్ పట్టణకు తరలివెళ్లారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు భూమారెడ్డి, ఉపాధ్యక్షుడు హాజీఖాన్ తదితరులు ఉన్నారు. ఎడపల్లి మండలం నుంచి పార్టీ నాయకులు తరలివెళ్లారు. నవీపేట మండలం నుంచి పార్టీ మండల అధ్యక్షుడు వి.నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో బోధన్‌కు తరలి వెళ్లారు.

## బోధన్‌లో పోలీసుల బందోబస్తు



పోలీసు బందోబస్తును పర్యవేక్షిస్తున్న బోధన్ ఏసీపీ కేఎం కిరణ్‌కుమార్, ప్రత్యేక పోలీసు బలగాలు

శక్కర్‌నగర్, నవంబర్ 9: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్లకు ఈనెల 10 చివరి రోజు కావడంతో బోధన్ నియోజకవర్గంలో పోటీ చేసే ప్రధాన పార్టీలకు చెందిన ముగ్గురు అభ్యర్థులు గురువారం భారీ ర్యాలీలు చేపట్టారు. పట్టణ శివారు నుంచి ర్యాలీలు నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్, ఎమ్మెల్సీ కవిత, షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా, కుటుంబ సభ్యులతో కలిసి భారీ ర్యాలీతో నామినేషన్‌కు ఊరేగింపుగా తరలివచ్చారు. బీజేపీ అభ్యర్థి వడ్డి మోహన్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి పి.సుదర్శన్ రెడ్డి ర్యాలీలతో తరలివచ్చారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బోధన్ ఏసీపీ కేఎం కిరణ్‌కుమార్, అడిషనల్ డీసీపీ గిరిరాజ్, అడిషనల్ డీసీపీ (లా అండ్ ఆర్డర్ ) జయరాం పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు. బోధన్ పట్టణ సీఐ బీడీ ప్రేమ్ కుమార్, రూరల్ సీఐ జి.శ్రీనివాస రాజుతోపాటు పలువురు స్థానిక పోలీసులు, అదనపు పోలీసు బలగాలతో బందోబస్తు నిర్వహించారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థిని



విద్యార్థిని వైష్ణవి

రెంజల్, నవంబర్ 9: మండల కేంద్రంలోని ఆదర్శ కళాశాలకు చెందిన మొదటి సంవత్సరం బైపీసీ విద్యార్థిని ఎస్. వైష్ణవి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బలరాం గురువారం తెలిపారు. ఈనెల 8న ఆర్మూర్ పట్టణంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ 19లో పాల్గొని ఈనెల 10 నుంచి 12 వరకు సిద్దిపేట్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థినిని ఎస్ఎంసీ చైర్మన్ మమ్మాయి నాగరాజు అభినందించారు.

## స్టడీ మెటీరియల్ అందజేత

రెంజల్, నవంబర్ 9: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో గురువారం పదోతరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేసినట్లు ప్రిన్సిపాల్ బలరాం, ఎస్ఎంసీ చైర్మన్ మమ్మాయి నాగరాజు తెలిపారు. ప్రభుత్వం అందించిన స్టడీ మెటీరియల్‌ను 90 మంది విద్యార్థులకు పంపిణీ చేశామని పేర్కొన్నారు.

## రామ్‌రెడ్డి మృతి బీఆర్ఎస్‌కు తీరని లోటు

నవీపేట,నవంబర్ 9: నవీపేట వాసి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ నాగేపూర్ రామ్‌రెడ్డి ఆకస్మికంగా మృతి చెందడం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. రామ్‌రెడ్డి చిత్ర పటానికి పూల మాల వేసి వేసి నివాళులర్పించారు. అనంతరం తాడ్‌గామ గ్రామంలో మాజీ సర్పంచ్ మోస్రా కపిల భూమ్‌రెడ్డి మాతృమూర్తి మృతి చెందగా బాధిత కుటుంబాన్ని సైతం పరామర్శించారు. కేసీఆర్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు రమణరావు, పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్‌రావు, పార్టీ నాయకులు నీరడి బుచ్చన్న తదితరులు ఉన్నారు.

## నిరుపేద అంత్యక్రియలకు ఆర్థిక సాయం

నవీపేట,నవంబర్ 9: ధర్యాపూర్ గ్రామానికి చెందిన సుంకపాక నర్సుబాయి అనారోగ్యంతో మృతి చెందగా అంత్యక్రియల నిమిత్తం జన వికాస సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు తెడ్డు పోశెట్టి రూ.5 వేల ఆర్థిక సాయాన్ని గురువారం అందజేశారు. కార్యక్రమంలో జన వికాస సేవా సంస్థ నాయకులు పాల్గొన్నారు.

## బోధన్ అసెంబ్లీ స్థానానికి పలు పార్టీల నాయకుల నామినేషన్

శక్కర్‌నగర్, నవంబర్ 9: బోధన్ అసెంబ్లీ స్థానానికి గురువారం పలు పార్టీలకు చెందిన అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ తరపున పి.సుదర్శన్‌రెడ్డి, బీజేపీ తరపున వడ్డి మోహన్ రెడ్డి, ధర్మ సమాజ్ పార్టీ తరపున మురళీ సాయం, ఏఐఎఫ్‌బీ తరపున దేవర్ల నాగరాజు, ఎంసీపీఐ తరపున మోసీన్ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, బోధన్ ఆర్డీవో బి.రాజాగౌడ్‌కు అందజేశారు.

# బీఆర్ఎస్‌లోకి బీజేపీ, బీజేవైఎం కార్యకర్తలు

### పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్సీ కవిత



ఎమ్మెల్సీ కవిత సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ, బీజేవైఎం కార్యకర్తలు

నవీపేట, నవంబర్ 9: బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పలు సంక్షేమ పథకాలకు ఆకర్శితులైన పలువురు బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు గురువారం నగరంలో ఎమ్మెల్సీ కవిత సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. భారత జాగృతి యువ నాయకుడు జాదవ్‌రాజ్ ఆధ్వర్యంలో బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు రమణ, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు నరేశ్, మద్దేపల్లికి చెందిన 30 మంది బీజేపీ, బీజేవైఎం కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్సీ కవిత గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు

### సొంత గూటికి చేరిన మాజీ ఉప సర్పంచ్

నవీపేట,నవంబర్ 9: కాంగ్రెస్ పార్టీ అవలంభిస్తున్న సిద్ధాంతాలు నచ్చక భారత జాగృతి జిల్లా కన్వీనర్ అవంతిరావు ఆధ్వర్యంలో తిరిగి బీఆర్ఎస్‌లో చేరినట్లు జన్నేపల్లి మాజీ ఉప సర్పంచ్ వీరేందర్‌రావు పేర్కొన్నారు. వీరేందర్‌రావు ఇటీవల కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి సమక్షంలో ఆ పార్టీలో చేరాడు. తిగిరి బీఆర్ఎస్‌లో చేరిన వీరేందర్‌రావును పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్‌రావు గులాబీ కండడా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ నాయకులు దొంత ప్రవీణ్‌కుమార్, కృష్ణమోహన్‌రావు, నీరడి బుచ్చన్న, బెల్లాల్ నర్సింగ్‌రావు, అల్లం రమేశ్, ఉమర్, గైని మోహన్, అజ్జూ, ఖలీమ్ తదితరులు ఉన్నారు.

### వార్డు సభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు ..

శక్కర్‌నగర్, నవంబర్ 9: బోధన్ పట్టణం ఆచన్‌పల్లిలో ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ నివాసంలో ఎడపల్లి మండలం జైతాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు యాతాలం శ్రీనివాస్, వార్డు సభ్యుడు కొడితె శ్రీనివాస్‌రావుతోపాటు బోయిని గంగారాం గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జైతాపూర్‌కు చెందిన సీనియర్ పార్టీ నాయకుడు ఉండి నాగేందర్‌రెడ్డి, ఎడపల్లి మండల భారత జాగృతి అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, రామకృష్ణా రెడ్డి పాల్గొన్నారు.



జైతాపూర్ వార్డు సభ్యుడు, కాంగ్రెస్ నాయకుడిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే షకీల్



జన్నేపల్లి మాజీ ఉప సర్పంచ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు